# రూపం కాదు, గుణం ప్రధానం

ఆ రోజు ఆదివారం. పరీక్షలన్నీ అయిపోయాయి. ఆ శ్రమనంతా మరిచిపోయినట్లుగా, ఆరోజు మధ్యాహ్నం నాలుగు గంటలవరకూ బాగా నిద్రపోయి లేచాడు విశ్వం. తలమీద కొట్టినట్లు, అప్పుడే వాడికి జ్ఞప్తికి వచ్చింది—ఆరోజు మొదటి ఆటకు 'బూట్ పాలిష్' సినిమాకు—రంగడు, రఘులతో కలిసి వెళ్లాలని. ఆదరా బాదరా స్నానంచేసి దుస్తులు తొడుక్కుని, తను దాచిన మూడు రూపాయల డబ్బులకోసం, బీరువా డ్రాయరు తెరిచాడు. తను డబ్బు దాచిపెట్టిన చోటుకు, మరో ప్రక్కగా నాన్నగారి రిస్టువాచీ వుండడం వాడికి కనుపించింది. దాన్ని చూస్తూ రెండు నిమిషాలుండిపోయాడు విశ్వం. తర్వాత డబ్బుతీసి, జేబులో పడేసుకుని, వంటయింట్లో వున్న తల్లి వద్దకు వచ్చాడు. "మా..."అని నసిగాడు.

"ఏరా విశ్వం!...స్నేహితుల్తో కలిసి సినిమాకెళ్లాలని చెప్పావుగా! ...ఇంకా వెళ్లలేదూ?" అని అడిగింది అమ్మ.

"ఇదిగో, బయల్దేరబోతున్నాను ...సరేగాని, నాన్న ఎక్కడికి పోయాడే?" అని అడిగాడు.

"పేకాటలో మునిగిపోయి వుంటారు—మూడో యింట్లో. ఎందుకూ?"

"మరేంలేదు... నాన్న రిస్టువాచీ, డ్రాయరులో చూచానే! ఈ ఒక్కపూట సినిమాకి చేతికి కట్టుకుపోతానే!" అని జాలిగా అన్నాడు విశ్వం.

"రిస్టువాచీ?! ... మీ నాన్నగారికి తెలిసిందంటే, నీ వీపు బద్దలు చేస్తారు" అంది అమ్మ.

సి. డి. యస్. రామయ్య

"ఎలా తెలుస్తుందే? ... ఇక వుదయం ఆఫీసుకెళ్లేప్పుడు మాత్రమేగా రిస్టువాచీని చూచుకోబోతున్నాడు. అంతలోకే, నేను వున్నచోటే దాన్నుంచేస్తాగా!" అన్నాడు ధీమాగా.

"ఏమో బాబూ!...నీ యోచన నాకు బాగా లేదుగానీ, ... జాగర్తగా తీసుకెళ్లి, మళ్లీ తెచ్చి పెట్టేయ్. జాగర్త!"అని వూరుకుంది అమ్మ.

విశ్వం సంతోషంతో గంతులేస్తూ, రిస్టువాచీ చేతికి కట్టుకుని బయలుదేరాడు.

అనుకున్న ప్రకారం, రఘు-రంగడు రౌండుటానాలో నాలుగున్నర గంటలకల్లా రెడీగా కాచుక్కూచునివున్నారు. విశ్వం వాళ్లని కలుసుకున్నాడు. తన చేతనున్న



# రూపం కాదు: గుణం ప్రధానం

రిస్టువాచీని వారికి చూపిస్తూ, డంబాలు పలకడం మొదలెట్టాడు విశ్వం. వాళ్లనాన్నగారు, ఈ రిస్టువాచీని తనని కట్టుకెళ్ళమన్నారనీ, వాళ్ళ నాన్నగారికి తనమీద మితిలేని ప్రేమనీ చెప్పాడు.

వాళ్లతో కలిసి హోటలుకెళ్ళిన తర్వాత, కిల్లీపాపువద్ద నిల్చుని, కబుర్లాడుకుంటున్నారు ముగ్గురూ. ఉండబట్టక, వీధిన వెళ్లే 'ఐస్ ఫ్రూట్'ను కొనుక్కొని తినడం మొదలెట్టారు రఘు, రంగడూ. కాని, విశ్వానికి ఐస్ అంటే గిట్టదు. కాబట్టి, కిల్లీపాపులో, రెండు బిస్కట్లు కొని, తింటూండగా, తోకాడించుకుంటూ, చీడ పట్టిన ఒక కుక్క వారివద్దకు వచ్చింది. తింటున్న బిస్కతులో కొంతతుంచి దానికి వేశాడు విశ్వం. అది దాన్ని తిని, మళ్ళీ తోకాడించుకొంటూ, విశ్వం ముఖంలోకి చూస్తూ కూర్చుండిపోయింది.

"పాపం, మంచి కుక్కలాగుంది. చీడవచ్చి, శరీరం చెడిపోయింది" అన్నాడు విశ్వం.

రఘు తాను తింటున్న 'ఐస్ ఫ్రూట్'లో కొంత పడేశాడు. ఆ కుక్క దాన్నితింది; మళ్ళీ తోక ఆడించుతూ, విశ్వం ముఖంలోకి చూస్తూవుంది.

"ఏంరోయ్, మనకో కొత్త మిత్రుడు పరిచయమై నట్టున్నాడే! —అవునా?" అని కుక్క ముఖంలోకి చూశాడు రంగడు. కుక్క రెండుకాళ్లూ పైకెత్తింది.

"భలే భలే!...అచ్చంగా మాటలునేర్చిన కుక్కరోయ్! మన మాటలు బాగా పసిగట్టి వింటోందిరా!...అవశ్యం ఇదీ మనమిత్రుడవ్వాల్సిందే!..."అన్నాడు రఘు—తన ఐస్‌ఫ్రూట్‌లో కొంతపడేస్తూ.

"మిస్టర్ చీడారావ్!... మీ పేరేమిటి?...మీ నివాసమెక్కడ? అని పరిహాసంగా అన్నాడురంగడు.

"నివాస మేముందిరా భాయ్, దానికి?... ప్రేమచూపే మనుష్యులు యెక్కడుంటే, అక్కడుంటుంది అది. మనం, ప్రేమతో ఆహారం పెట్టి పిలిచామనుకో, అది మనల్నే అనుసరిస్తుంది. అంతే!" అంటూ కిల్లీషాపులో, మరో బిస్కత్తుకొని, దానికి కొంత కొంతగా వేశాడు విశ్వం.

"ఒరే విశ్వం!...దాని కెందుకురా, పూరికే తిండిపడేస్తావ్?... కర్మం, చీడపట్టిన కుక్క, అది మనల్ని అనుసరించడం, మనకంత మంచిదిగాదు." అన్నాడు రఘు.

అలాకులాసాగా కబుర్లాడుకుని, వేళకి మొదటిసినిమాకి ముగ్గురూ వెళ్లారు.' థియేటర్లో అర్థగంటసేపు కరంటుఆగిపోయింది; తీరా సినిమా వదిలేసరికి రాత్రి పదిగంటలయింది. బస్సులు దొరకటం శ్రమ అయింది గూడా!... తీరా బస్సు దిగాక, రఘు రంగడు వాళ్ల యిళ్ళ దారిపట్టారు. బస్సు దిగిన తర్వాత, తనిల్లు చేరుకోడానికి అరమైలు వెళ్లాల్సివుండటంవల్ల, విశ్వంకి భయంవేసింది. ఏ పోకిరి వెధవలైనా, తన్ను బెదిరించి, అది లించారంటే తనేంచేస్తాడు? అనుకుంటూ నడుస్తున్నాడు. తను స్నేహితులతో కలిసి, కబుర్లాడిన కిల్లీషాపు గడిచి, మరో చిన్నవీధిగుండా నడిచిపోతున్నాడు విశ్వం! రిస్టువాచీ జ్ఞప్తికొచ్చింది. ఎవడైనా సోమరి వెధవ, తన్ను ఎదిరించి, తన రిస్టువాచీ లాక్కుపోతే, తన గతేమవుతుంది? నాన్న తనను పూరికే వదిలిపెట్టాడా?...తనకే గాకుండా, తన అమ్మకిగూడా చీవాట్లూ, పెట్లూ తగలవూ?...ఛీ! ఇక యెప్పుడూ ఇతరులసొత్తు తాకగూడదు. నాన్న రిస్టువాచీ తను కట్టుకోడం మూలానేగదా ఇంతిగా భయపడవలసి వచ్చింది?...

ధైర్యం చిక్కబట్టుకుని నడుస్తున్న విశ్వానికి, మరో చిన్న సందులో, ఒక నల్లని, లావుపాటి రూపం ప్రత్యక్షమయింది. ఆ రూపాన్ని చూస్తూనే, భయంతో కొయ్యబారిపోయాడు విశ్వం. ముక్క బీడీ, నోటనుంచుకున్న ఆవ్యక్తి కింగ్‌కాంగ్‌లా వున్నాడు.

"యార్రా నీ?"అని అడిగాడు ఆ కింగ్‌కాంగ్.

విశ్వం తమిళాన్ని అర్థంచేసుకోగలడుగాని మాట్లాడలేడు. కాబట్టి, "నేను...ఇంటికి...పోతు..." అని తడబడ్డాడు భయంతో. ఆ కింగ్‌కాంగ్ విశ్వం సమీపానికొచ్చాడు.

"ఎంగేపోయివర్రే?" - (అంటే నువ్వెక్కడికిపోయి వస్తున్నావని) అడిగాడు కింగ్‌కాంగ్.

"సిని...మాకి...!"

"పణం...వుండా?"

"డబ్బు అంతా అయిపోయింది



"పాపం మంచికుక్కలాగుంది. చీడవల్ల చెడిపోయింది."అన్నాడు విశ్వం.

...పావలా ...మాత్రమేవుంది... ఇంకేమీలేదు." అన్నాడు చేతులూపుతూ విశ్వం. చేతులూపుతున్నప్పుడు, విశ్వంచేతిలోని వాచీ ఆ రౌడీకళ్లపడింది.

"ఆ రిస్టువాచీ నాకు కుడు." అన్నాడు ఆరౌడీ.

విశ్వం నిలువునా నీరైపోయాడు. "ఇది మానాన్నది. ఇది నీకిచ్చేస్తే మానాన్న నన్ను చంపేస్తాడు." అని ఏడ్వ లంకించపోయాడు, విశ్వం.

"డేయ్!" అని ఉరిమాడు రౌడీ! ... "వాయ్ గట్టియా తెరిందియనా కుత్తిదువేఁ! (నోరు గట్టిగా తెరచావంటే, పొడిచేస్తాను)" అంటూ, విశ్వానికి బాకు చూపిస్తూ బెదిరించాడు. విశ్వానికి భయంలో మైకం వచ్చినంతపనయింది.

"కై ట్రా! (విప్పరా)"అని గర్జించాడు ఆ కింగ్ కాంగ్.

అంతసేపూ, విశ్వానికి వెనకాల చీకటిలో దాగివుండి, ఇదంతా గమనిస్తూన్న ఒకకుక్క, హఠాత్తుగా ఆ రౌడీమీదపడి, అతని చేతిమీద కరిచింది. రౌడీచేతిలోని కత్తిని కిందపారేసి, కుక్కని అదిలించబోయాడు. కానీ, అంతలోకే, కుక్క, ఆ రౌడీశరీరంమీద నాలుగైదు కాట్లుపడేసింది. చేతిమీదా, కాళ్ళమీద నెత్తురు కారుతుండగా, బాధకి తాళలేక, ఆ రౌడీ పలాయనం చిత్తగించాడు.

ఆపదసమయంలో తన్ను వచ్చి కాపాడిన, ఆ కుక్కవేపు జాగ్రత్తగా చూశాడువిశ్వం! ...అతనికాశ్చర్యం కలిగింది! ఆ సాయంత్రం కిళ్లీషాపు వద్ద, తను బిస్కత్తుపెట్టిన కుక్కే; రంగడు రఘులు చీడకుక్కని పరిహాసంచేసిన ఆకుక్కే!...దానికి తన మీద ఎంత ప్రేమ! అనుకున్నాడు విశ్వం. తోకాడించుకుంటూ తన వద్దకు వచ్చిన ఆ కుక్కని - దాని శరీరమంతా చీడగావుండినాగూడా - మెల్లగా నిమిరాడు. దాన్ని తోడు తీసుకుని, యిల్లు చేరాడు విశ్వం.

* * *

మర్రోజుసాయంత్రం - అయిదు గంటలకి, రంగడూ - రఘులతో కలిసి కిల్లీ షాపువద్దకు వచ్చాడు విశ్వం. అక్కడ మళ్ళీ ఆ చీడకుక్క ప్రత్యక్షమయింది. దాన్ని ప్రేమగా పిలచి, దానికి కావలసినంతవరకూ తిండి పెట్టాడు విశ్వం. అది తనకు రాత్రిచేసిన వుపకారాన్ని తన స్నేహితులకు విశదంగా చెప్పాడు విశ్వం. రంగడు, రఘులు ఆమాటలు విని ఆశ్చర్యపడ్డారు. వారికి, ఆ చీడకుక్కమీద జాలి, ప్రేమ కలిగాయి.

"అయితే, ఈ రోజునుంచీ చీడా రావ్ మనస్నేహితుడే!"అని సంతృప్తిగా నవ్వుకున్నారు ముగ్గురూ. వారి మాటలకు తను సమ్మతించినట్లు, ఆ చీడకుక్క తన ముందరి కాళ్లు రెండింటిని మీదికెత్తి నిలుచుంది. ★